క్లుప్తంగా

విద్యార్థులకు చెస్ పోటీలు



గుడివాడ టౌన్: స్థానిక కేబీఆర్ గవర్నమెంట్ ఐటీఐ కళాశాల, కేటీఆర్ మహిళా కళాశాల, ఏఎన్నార్ కళాశాలల్లో చెస్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్ వీ సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఈ విధమైన కార్యక్రమాల్లో పాల్గొని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి కోసమే ప్రభుత్వాలు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జి.హరిధర్మేంద్ర, ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పీజీఎస్ కుమార్, కేటీఆర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

వెంట్రప్రగడ-2 వీఆర్వోగా అజయ్‌కుమార్



వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ-2 గ్రామ వీఆర్వోగా చాట్ల అజయ్ కుమార్ బదిలీపై వచ్చారు. పెదపారుపూడి నుంచి బదిలీపై ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. వీఆర్వో పోస్టు ఖాళీగా ఉండటంతో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వీఆర్వో అజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందిస్తామన్నారు.

నిర్మానుష్యంగా రహదారులు




పామర్రు: ఎండ వేడి తీవ్రతకు ప్రజలు అల్లాడిపోతున్నారు. శుక్రవారం ఎండ వేడి సుమారు 43 డిగ్రీలకు చేరటంతో ప్రజలు గ్రీష్మ తాపానికి లోనయ్యారు. ఉదయం 9 గంటల నుంచే ఎండ వేడి తీవ్రంగా మారుతుండటంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారు. గంట గంటకు ఎండ వేడిమి పెరుగుతుండటంతో రహదార్లు అన్నీ జన సంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. రోజు రోజుకు పెరుగుతున్న ఎండలకు ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. ప్రత్యేకంగా వృద్ధులు చిన్నారులు అల్లాడిపోతున్నారు. ఎండలకు తాళలేక ఉదయం పూటే పనులను చక్కబెట్టుకుని ఇళ్లకే పరిమితం అవుతున్నారు.

పచ్చిరొట్ట ఎరువుల మినీ కిట్ల పంపిణీ



మండవల్లి: మండలంలోని లింగాల గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మాస్టర్ ట్రయినర్ పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో పచ్చిరొట్ట విత్తనాల మినీకిట్లను తయారు చేసి మండల వ్యవసాయాధికారి షేక్ జరీనా సమక్షంలో శుక్రవారం రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి నాగవిజయ, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

జనజాగృతి సభను విజయవంతం చేయాలి



మొవ్వ: విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో జులై 7వ తేదీన ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించే మాదిగల జనజాగృతి సభను విజయవంతం చేయాలని పామర్రు నియోజకవర్గ కన్వీనర్ కనగాల వెంకటరత్నం మాదిగ పిలుపునిచ్చారు. మొవ్వ బస్టాండ్ ప్రాంగణంలో మాదిగల చైతన్య కమిటీలు బలోపేతంలో భాగంగా మొవ్వ మండల సభను శుక్రవారం నిర్వహించారు. ఈ మేరకు కర పత్రాలను ఆవిష్కరించి పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ సికిందర్ మాదిగ, నాయకులు గురిందపల్లి అబ్రహం, కొల్లూరి రామాంజనేయులు మాదిగ, జై బ్రహ్మయ్య మాదిగ, మండల నాయకులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే సమగ్రాభివృద్ధి

- ఎమ్మెల్సీ జయమంగళ, ఎమ్మెల్యే డీఎన్నార్
- మండల సర్వసభ్య సమావేశం



మండల సమావేశంలో ఎమ్మెల్సీ జయమంగళను సన్మానిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎంపీపీ కృష్ణ

కైకలూరు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో సమగ్రాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. స్థానిక మీటింగ్ హాల్‌లో ఎంపీపీ అడవి కృష్ణ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఎమ్మెల్సీగా పదవి చేపట్టిన తర్వాత మొదటి సారిగా సమావేశానికి హాజరైన జయమంగళను ఎమ్మెల్యే, ఎంపీపీ సన్మానించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ స్థాయిలో ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ అర్హులైన ప్రతి రైతుకు అందించే విధంగా ఫిషరీస్, విద్యుత్‌శాఖ సిబ్బంది కృషి చేయాలన్నారు. కైకలూరు మండలంలో సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎంపీ, ఎమ్మెల్యే, మండల పరిషత్, పంచాయతీ నిధుల నుంచి రూ.2.40 కోట్లు మంజూరు చేశారన్నారు. సర్పంచ్‌లు పనులు ప్రారంభించకుంటే నిధులు వెనక్కి వెళ్లే అవకాశముందన్నారు. నియోజకవర్గంలో 79 సచివాలయాలకు గడప గడపకు నిధులు రూ.13.60 కోట్లు మంజూరయ్యాయన్నారు. పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. వచ్చే సమావేశానికి పూర్తిస్థాయిలో సర్పంచ్‌లు హాజరుకావాలని సూచించారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ కొల్లేరు గ్రామమైన పందిరిపల్లిగూడెం నుంచి పదో తరగతి విద్యార్థులు భుజబలపట్నం వెళ్లి అక్కడి స్కూల్లో పరీక్షలు రాస్తున్నారన్నారు. పందిరిపల్లిగూడెంలో పది పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. తనతోపాటు ఎమ్మెల్యే డీఎన్నార్ ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు.

ఎంపీపీ మాట్లాడుతూ డ్రెయిన్ల అభివృద్ధి పనులు వర్షాకాలానికి ముందుగానే చేపట్టాలన్నారు. అనంతరం వివిధ ప్రభుత్వశాఖల పనితీరుపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కురేళ్ళ బేబీ, మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షుడు మహమ్మద్ జహీర్, కైకలూరు సర్పంచ్ దానం మేరి నవరత్నకుమారి, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, తహసీల్దారు బి.రామకృష్ణ, ఎంపీడీవో కె.రామలింగేశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆణిముత్యాలకు సన్మానం



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి, రాజేష్

పమిడిముక్కల: ప్రభుత్వ బడుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆణిముత్యాలను అందిస్తున్నారని సర్పంచ్ జంపాన ధనలక్ష్మి అన్నారు. మండలంలోని తాడంకి జెడ్పీ పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఈడే శ్యామలరేఖ, జలసూత్రం హేమంత్‌లను ఏసుక్రీస్తు ఆది అపోస్తుల సంఘంలో పాస్టర్ ఏసురత్నం ఆధ్వర్యంలో విద్యార్థులకు సన్మాన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులతో పాటు గ్రామంలో వివిధ తరగతుల్లో కొనసాగుతున్న విద్యార్థులు ప్రగతి సాధించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సర్పంచ్ ధనలక్ష్మి, పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు మాచవరపు రాజేష్ విద్యార్థులను సత్కరించి అభినందించారు. అనంతరం జిల్లాలో ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు అందుకున్న సందర్భంగా సర్పంచ్ ధనలక్ష్మిని సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

- విద్యుత్ అధికంగా వాడుతున్న 97 సర్వీసుల గుర్తింపు
- రూ.2,92,000 అపరాధ రుసుం విధింపు



మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఈఈ వెంకటేశ్వర్లు తదితరులు

పామర్రు: మండల పరిధిలో శుక్రవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. మండలంలోని 26 గ్రామాల్లో సర్వీసులను 43 బృందాలు తనిఖీలు చేపట్టారు. అనంతరం స్థానిక కార్యాలయంలో విద్యుత్ విజిలెన్స్ ఈఈ కే వెంకటేశ్వర్లు వివరాలను వెల్లడించారు. పామర్రు మండలంలోని అన్ని గ్రామాలను 43 బృందాలుగా 2,223 సర్వీసులను తనిఖీలు చేశామన్నారు. విద్యుత్ అధికంగా వాడుతున్న 97 సర్వీసులను గుర్తించి అపరాధపు రుసుముగా రూ.2,92,000 విధించామని తెలిపారు. వీటిలో గృహ వినియోగదారులు 89 మందికి రూ.2.76 లక్షలు, వాణిజ్య సర్వీసులు కలిగిన 8 మందికి రూ.16 వేలు అపరాధపు రుసుము విధించామని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా విద్యుత్ వినియోగిస్తూ ప్రభుత్వానికి నష్టం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మచిలీపట్నం డివిజన్ పరిధిలో విద్యుత్ తనిఖీలను ప్రారంభించామని తెలిపారు. ఈ తనిఖీల్లో మచిలీపట్నం ఆపరేషన్ ఈఈ ఎం.భాస్కరరావు, పామర్రు ఆపరేషన్ డీఈఈ కె.సుందరరావు, పామర్రు ఆపరేషన్ ఏఈ కె.మోహనకృష్ణ, మచిలీపట్నం డివిజన్‌లోని డీఈఈలు, ఎఈలు, లైన్ ఇన్స్పెక్టర్లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో కొనసాగుతున్న శిక్షణ



జమీగొల్వేపల్లిలో విద్యార్థులకు యోగా నేర్పుతున్న వెంకట ధర్మారావు



మండవల్లిలో బుక్ ఎగ్జిబిషన్



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

జమీగొల్వేపల్లి(పామర్రు): యోగాసనాలతో ఆరోగ్యం మెరుగుపడుతుందని యోగా గురువు పొట్లూరి వెంకట ధర్మారావు అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లిలోని శాఖ గ్రంథాలయంలో శుక్రవారం యోగా, ధ్యానం అనే అంశాలపై అవగాహన తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాసనాల వలన శారీరక, మానసిక దృఢత్వం పొందగలుగుతామన్నారు. గ్రంథాలయ అధికారి వి.నాగ సురేష్ మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ వేసవి శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా నిర్వహించే వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు. పామర్రులో శాఖ గ్రంథాలయంలో ఆటల పోటీలు, నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీరాణి పాల్గొన్నారు.

మండవల్లి: మండవల్లి గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయాధికారి షేక్‌పర్వీన బుక్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని పుస్తకాలు, మ్యాగజైన్స్ ప్రదర్శించారు. అనంతరం పిల్లలతో డెకరేషన్, మెమొరీ గేమ్స్ ఆడించారు.

కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాలి

ముదినేపల్లి రూరల్: మారుతున్న కాలమాన పరిస్థితులకనుగుణంగా విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఉపాధ్యాయుడు కే ప్రకాష్ అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొని విద్యార్థులకు శుక్రవారం కంప్యూటర్ పరిజ్ఞానంపై ఉపాధ్యాయుడు ప్రకాష్ బోధన చేశారు. అన్ని రంగాల్లో రోజురోజుకు కంప్యూటర్ ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. విద్యార్థులు కంప్యూటర్ వినియోగంపై పట్టు సాధించాలన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌లను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. లైబ్రేరియన్ ఎం శ్రీదేవి ఆధ్వర్యంలో ఇండోర్ గేమ్స్ నిర్వహించారు.

గుడివాడ టౌన్: స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. శుక్రవారం ఉపాధ్యాయుడు హేమంత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గ్రంథాలయాలు-ఉపయోగాలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు టి.ప్రవల్లిక, పి.శాంతి, సునీత తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సత్వర సేవలందించాలి

ముదినేపల్లి రూరల్: రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రతి రైతుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో సత్వర సేవలందించాలని మండవల్లి సబ్ డివిజన్ ఏడీఏ జి. వెంకటమణి అన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా తొలకరి వర్షాలు ప్రారంభంకాక మునుపే సబ్‌డివిజన్లోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్ సాగుకు అవసరమయ్యే వరి విత్తనాలు సిద్ధంగా ఉంచారని చెప్పారు. ముదినేపల్లి మండలంలో ఎంటీయూ-1061 రకం వరి విత్తనాలు 78 టన్నులు, 7029 రకం వరి విత్తనాలు 81 టన్నులు అమ్మకానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ విత్తనాలపై సబ్సిడీ ధరలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. కిలోకు రూ.5 వంతున సబ్సిడీ ఇస్తామన్నారు. ప్రతి రైతుభరోసా కేంద్రం పరిధిలో పది మట్టి నమూనాలు తీయాలన్నారు. ఎరువులు, విత్తనాల సరఫరాపై రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. రైతులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని సూచించారు. వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ మాట్లాడుతూ జీలుగ, పిల్లిపెసర విత్తనాల గురించి రైతులకు తెలియాలని చెప్పారు. పచ్చిరొట్ట పైర్లగా వీటిని సాగుచేసేందుకు రైతులను చైతన్యపరచాలని కోరారు. పచ్చిరొట్ట పైర్లవల్ల ఉపయోగాలను రైతులకు వివరించాలని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదపారుపూడి: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా ఉదయం నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టీ రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. విద్యుత్ లైన్లు, సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గుడివాడ టౌన్: పట్టణంలో ఉదయం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో శనివారం విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతులు, లైన్ల క్రమబద్ధీకరణ తదితర కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యే డీఎన్నార్‌ను కలిసిన అధికారులు



కైకలూరు: సాధారణ బదిలీల్లో భాగంగా కై కలూరు నియోజకవర్గానికి వచ్చిన వివిధ శాఖల అధికారులు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణను వారి నివాస గృహాల వద్ద మర్యాద పూర్వకంగా శుక్రవారం కలిశారు. విధి నిర్వాహణలో అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు చెప్పారు. నందిగామ ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తూ మండవల్లి మండల తహసీల్దార్‌గా బదిలీపై వచ్చిన కె.రాజ్ కుమార్, కృష్ణా జిల్లా పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై కలిదిండి ఎంపీడీఓగా వచ్చిన వి.రాంబాబు, నిడమర్రు మండల ఏపీఎంగా పనిచేస్తూ మండవల్లి మండల ఏపీఎంగా వచ్చిన జి.రాజశ్రీ, మచిలీపట్నం జిల్లా పౌరసరఫరాల కార్యాలయంలో డీటీగా పనిచేస్తూ కలిదిండి మండల రెవెన్యూ కార్యాలయంలో డెప్యూటీ తహసీల్దార్‌గా వచ్చిన టి.ఎస్.ఎస్.కిరణ్ కుమార్, ఆర్ఐ పద్మజ రోజాలు మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో ఉన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



కై కలూరు: ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులు అలవర్చుకోవాలని ప్రకృతి వ్యవసాయ డిజిటల్ సీఆర్పీ గౌతంకుమార్ చెప్పారు. వింజరం రైతు భరోసా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సీఆర్పీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. పచ్చిరొట్టను వ్యవసాయ భూమిలో ఉపయోగించడం వల్ల ఎంతో మేలు జరుగుతోందన్నారు. అనంతరం 10 రకాల పచ్చరొట్ట విత్తనాలతో కూడిన 5 కేజీల బ్యాగులను రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ పృథ్వీరాజు, ఐసీఆర్పీలు అహోబలరావు, రామాంజనేయులు, వీపీఏ జె.దుర్గా, రైతులు పాల్గొన్నారు.

వానరాల సంచారం..అరికడితే సంతోషం



జమీదగ్గుమిల్లిలో యథేచ్ఛగా తిరుగుతున్న కోతుల సమూహం

పామర్రు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో వానర మూకలు హల్‌చల్ చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా ప్రజలను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. మండలంలోని జమీదగ్గుమిల్లి, రాపర్ల, పామర్రు తదితర గ్రామాల్లో వందల సంఖ్యలో కోతులు గ్రామస్తులను భయ భ్రాంతులకు గురి చేస్తున్నాయి. జమీదగ్గుమిల్లిలో గ్రామంలో కోతులు ఇళ్లపైకి ఎక్కి రకరకాల విన్యాసాలు చేస్తున్నాయి. రేకులను పగలగొట్టడం, ఇళ్లలోకి దూరి ఇంట్లోని వస్తువులను తినుబండారాలను ఎత్తుకు పోతున్నాయి. ఎవరైనా అదిరించాలని ప్రయత్నిస్తే వారిపై తిరిగబడుతున్నాయి. దీనితో గ్రామస్తులు భయపడుతున్నారు. గ్రామానికి చెందిన కాకర్ల వెంకటేశ్వరరావు, కందుల గోవిందు అనే ఇరువురిని కోతులు కరిచి గాయ పర్చాయి. వారు స్థానిక వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. రహదార్లపై యథేచ్ఛగా తిరుగుతూ రహదారిపై వెళ్లే వారి వద్ద ఉన్న వస్తువులను లాక్కుని పారిపోతున్నాయి. అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి గ్రామాల ప్రజలను రక్షించాలని కోరుతున్నారు.

బీమా సాయం అందజేత



బీమా సొమ్ము అందజేస్తున్న వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు తదితర నాయకులు

పామర్రు: పామర్రు రెండో సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యురాలు భోగిన వెంకటేశ్వరమ్మ మనుమడు భోగిన ఆంజనేయులు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల సహాయం శుక్రవారం మృతుని భార్య చిన్నారికి నగదుని అందజేశారు. వైస్‌ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా బోర్డు డైరెక్టర్ బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు ధనాల కృపావతి, మండల కో ఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, వార్డుమెంబర్లు మెంబరు ఆరేపల్లి శ్రీహరి, తాడిశెట్టి కుమార్, కూతాడి శశిరేఖ, యార్లగడ్డ శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు బొమ్మారెడ్డి మాధవరెడ్డి, కె శ్రీనివాసరావు, ఎన్ .సాంబిరెడ్డి, సచివాలయ వేల్ఫేర్ అసిస్టెంట్ పల్లవి, వలంటీర్ కోటి రమేష్ పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి

- ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- అగినపర్రులో గడప గడపకు మన ప్రభుత్వం



అగినపర్రులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: నవరత్నాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ తెలిపారు. ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందుతుండటంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. మండలంలోని అగినపర్రులో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులు పొందిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్లను అందజేశారు. గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఎమ్మెల్యే ఆరా తీశారు. అంతర్గత రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతుందన్నారు. జగనన్న పాలనలో అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధా ప్రవీణ్, తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి, సర్పంచ్ కోట మణిరాజు, ఎంపీటీసీ జుఝువరపు శృతి, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కినేని సతీష్, మండల పార్టీ అధ్యక్షుడు యలమంచలి గణేష్, వైస్ ఎంపీపీలు గంజాల సీతారామయ్య, కొడమంచిలి మహేష్, నియోజకవర్గ బూత్ కన్వీనర్ మారపాక మహేష్, పార్టీ నాయకులు యేనుగ మస్తాన్‌రావు, వీరంకి వెంకటేశ్వరరావు, వీర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు



గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అన్నపూర్ణ

కైకలూరు: గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు శీతనపల్లి పీహెచ్‌సీలో శుక్రవారం నిర్వహించారు. ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభయన్ కార్యక్రమంలో భాగంగా డాక్టరు అన్నపూర్ణ 50 మంది గర్భిణులకు పరీక్షలు చేశారు. ఏడుగురు హై రిస్క్ జాబితాలో ఉన్నట్లు గుర్తించారు. గర్భిణులకు ఐరన్, పోలిక్ యాసిడ్, కాల్షియం మాత్రలు అందించారు. గర్భిణులు, సహాయకులకు కై కలూరు శ్రీ సత్య సాయి సేవా సంఘం సహకారంతో ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మూర్తి, శ్రీనివాసరావు, కనకదుర్గ, లక్ష్మీ కుమారి, సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు వీరప్ప, విజయలక్ష్మి, రాధాకృష్ణ, సత్యవతి, ఝాన్సి, సాయిప్రియ, గోపి, కృష్ణమోహన్, చలపతి పాల్గొన్నారు.

ఏపీఆర్‌జేసీలో జెడ్పీ విద్యార్థికి స్టేట్ ర్యాంకు

కోడూరు: ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన ఏపీఆర్‌జేసీ ఎంట్రన్స్ టెస్ట్‌లో కోడూరుకు చెందిన విద్యార్థి స్టేట్ ర్యాంకు సాధించాడు. స్వతంత్రపురం జెడ్పీ పాఠశాలలో పదో తరగతి పూర్తిచేసిన ఈర్ల ధనశేఖర్ స్టేట్ 218 ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. పదో తరగతి పరీక్షలు పూర్తి కాగానే కోడూరు మెయిన్ ఎంపీయూపీ పాఠశాలలో ఏపీఆర్‌జేసీ ఎంట్రన్స్ టెస్ట్‌కు సంబంధించి ఉచిత శిక్షణ తరగతులను పాఠశాల ఉపాధ్యాయుడు కాశీభొట్ల నాగభూషణం నిర్వహించారు. ఇక్కడ శిక్షణ పొందిన ధనశేఖర్‌కు స్టేట్ ర్యాంకు రావడంతో నాగభూషణం అతడిని అభినందించారు.